ప్రజాశక్తి

ఆదివారం 24 మార్చి 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

వలస ఓటర్లే కీలకం

భీమిలి నియోజకవర్గం మధురవాడపై దృష్టి కేంద్రీకరించిన పార్టీలు

ప్రజాశక్తి - మధురవాడ

రాష్ట్రంలో భీమిలి నియోజకవర్గానికి ఓ ప్రత్యేకత ఉంది. ఇది పెద్దది. ఎక్కువ మంది ఓటర్లు కలిగినది. అందునా వలస ఓటర్లే అత్యధికంగా ఉన్న సెగ్మెంట్. ముఖ్యంగా ఈ నియోజకవర్గంలో అభ్యర్థుల జయాపజయాలను నిర్ణయించేది మధురవాడ ప్రాంతం. మొత్తం ఓటర్లలో అత్యధికులు ఇక్కడే ఉన్నారు. దీంతో రాజకీయ పార్టీల నేతల కళ్లన్నీ మధురవాడ ప్రాంతంపైనే ఉన్నాయి. ఇక్కడి ఓటర్లను ప్రసన్నం చేసుకుంటే గట్టెక్కవచ్చనే భావన అందరిలోనూ కనిపిస్తోంది. కాగా ఇక్కడి వారిలో అధికశాతం ఇతర ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడినవారే కావడంతో కుల, మతాలకు అతీతంగా ఓటింగ్ జరుగుతుందని ఎన్నికల విశ్లేషకులు చెబుతుంటారు.



ఎన్నికల షెడ్యూల్ ప్రకటన తర్వాత నోటిఫికేషన్‌కు, పోలింగ్‌కు సమయం ఉన్నప్పటికీ దాదాపు అన్ని పార్టీలూ మధురవాడపైనే ప్రధానంగా దృష్టి సారించాయి. గత సాధారణ ఎన్నికల నాటికి భీమిలి నియోజకవర్గం ఓటర్లు 3,55,491. ప్రస్తుతం ఆ ఓటర్లు సంఖ్య గణనీయంగా పెరిగింది. నమోదుకు అవకాశం ఉండటంతో మరింత పెరగనుంది. ఈ క్రమంలో ఇప్పుడున్న ఓటర్ల జాబితాను బట్టి జివిఎంసి 5, 6, 7 వార్డులకు చెందిన ఓటర్లే లక్షకుపైగా ఉన్నారు. దీంతో భీమిలి నియోజకవర్గంలో అభ్యర్థి విజయావకాశాలు తేల్చే కేంద్రంగా మధురవాడ ఉందని చెబుతున్నారు.

మధురవాడలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన వారు వందకుపైగా కాలనీల్లో నివాసం ఉంటున్నారు. వివిధ పబ్లిక్, ప్రైవేటు సెక్టార్లలో పనిచేస్తున్న ఉద్యోగులున్నారు. అక్షరాస్యులు ఎక్కువ. ఇక్కడి ఓటర్లు ఏ పార్టీపై మొగ్గుచూపుతారో తెలియని స్థితి. మధురవాడ వాంబేకాలనీ, స్వతంత్రనగర్ పునరావాస కాలనీ, పిఎం.పాలెం పునరావాస కాలనీ, మారికివలస రాజీవ్ గృహ కల్ప కాలనీ, సాయిరామ్ కాలనీ, కొమ్మాది, కె1, కె 2 కాలనీ, పిఎం.పాలెం రత్నగిరి హౌసింగ్ బోర్డు కాలనీ, మిథిలాపురి వుడా కాలనీ తదితర ప్రాంతాల్లో వలస ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది. ముఖ్యంగా మధురవాడ, పిఎం.పాలెం, కొమ్మాది పరిసరాల్లో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి ఉపాధి కోసం వలస వచ్చి, ఇక్కడ స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్న వందలాది కుటుంబాలున్నాయి. వీరిలో అధిక శాతం మందికి ఇక్కడే ఓటు హక్కు ఉంది. దీంతో వీరి ఓట్లపై పార్టీల నాయకులు దృష్టిపెట్టారు. మధురవాడ పరిసరాల్లో కులాలు, మతాలకు ఓటు బ్యాంకులు మిగతా 2లో..

డ్రగ్స్‌పై సమగ్ర విచారణ జరపాలి

- దోషులను కఠినంగా శిక్షించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి

విశాఖలో తాజాగా పట్టుబడ్డ మాదక ద్రవ్యాలపై సమగ్ర విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్టు సంస్థకు చెందిన రొయ్యల మేత పేరుతో డ్రగ్స్ దిగుమతి అయ్యాయని పేర్కొన్నారు. ఈ నెల 16న షిప్ విశాఖ వచ్చినప్పటికీ 21వ తేదీ వరకు అత్యంత రహస్యంగా ఉంచారని తెలిపారు. దీనిపై వైసిపి, తెలుగుదేశం, బిజెపి పార్టీల పాత్ర వున్నట్లు ప్రజలు భావిస్తున్నారన్నారు. నిఘా వ్యవస్థ వైఫల్యం కూడా కొట్టొచ్చినట్లు కనిపిస్తోందన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులు ఎంతటివారైనా రాజకీయ ప్రలోభాలకు గురికాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పోలీస్ కమిషనర్ బ్రెజిల్ నుంచి సంధ్య మెరైన్ ఎక్స్‌పోర్టుకు డ్రగ్స్‌తో కూడిన కంటైనర్ విశాఖపట్నం వచ్చిందని తెలియజేశారన్నారు. అంత యథేచ్ఛగా డ్రగ్స్ విశాఖకు వచ్చిందంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత నిర్లక్ష్యంగా వున్నాయో అర్థమవుతుందన్నారు. సంధ్యా మెరైన్ ఎమ్‌డి కె.వీరభద్రరావు, డాక్టర్ కెవి.ప్రసాదరావు ఇద్దరూ కలిసి ఆక్వా ఎక్స్‌పోర్టు వ్యాపారం చేస్తున్నారన్నారు. డాక్టర్ కెవి.ప్రసాదరావు స్వయానా బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధరేశ్వరి వియ్యంకుడని తెలిపారు. వీరు పినాకిల్ హాస్పిటల్‌ను కూడా నడుపుతున్నారన్నారు. సమాజానికి సేవచేయాల్సిన వారు డ్రగ్స్ దిగుమతి చేసే వ్యాపారం చేయడమంటే ఈ సమాజాన్ని మరింత దిగజార్చడమే అవుతుందని తెలిపారు. వీరికి బిజెపి, తెలుగుదేశం పార్టీతో ప్రత్యక్షమైన సంబంధాలు వున్నట్లు ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ సహకారం కూడా వున్నట్లు అర్థమవుతోందన్నారు. దిగుమతి చేసిన డ్రగ్స్ విలువ రూ.50 వేల కోట్లు ఉంటుందని, ఈ దిగుమతి అంతా విశాఖ కంటైనర్ టెర్మినల్ నుండే జరిగిందని తెలిపారు. 50 వేల కోట్ల రూపాయల డ్రగ్స్ పట్టుబడిన కంటైనర్ టెర్మినల్‌ను జెఎం.భక్సీ (ముంబయి) నిర్వహిస్తోందన్నారు. విశాఖ కంటైనర్ టెర్మినల్‌ను 33 ఏళ్ల పాటు పిపిపి కింద 2002లో ఆనాటి కేంద్ర బిజెపి వాజ్‌పేయి ప్రభుత్వం లీజుకిచ్చిందన్నారు. అప్పటి నుంచి జెఎం.భక్సీ సంస్థ నిర్వహణ సాగిస్తోందని తెలిపారు. ఆ సంస్థకు, సంధ్యా ఆక్వా సంస్థకు మధ్య ఎలాంటి సంబంధాలున్నాయో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. వచ్చిన ప్రతి కంటైనర్‌ను స్కాన్ చేసి లోపల కార్గో ఏమిటో నిర్ధారించాల్సి ఉందని, కానీ అలా జరిగినట్లు మిగతా 2లో..

నేటి నుంచి ఐపిఎల్ టిక్కెట్ల విక్రయాలు

వార్త 4లో..

'ఉక్కు' పరిరక్షణ అంశాన్ని మ్యానిఫెస్టోలో పెట్టాలి

వార్త 4లో..

ఉబర్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించండి

వార్త 2లో..



అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం మోసయ్యపేట పంచాయతీ కొత్తూరు గ్రామంలో భగత్ సింగ్ విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు, గ్రామ యువకులు

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాటాలు

వర్ధంతి సభల్లో వక్తలు

వార్తలు 8లో..

ఇవిఎం గోదాముల్లో తనిఖీలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఆరిలోవ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగర పరిధిలోని చినగదిలి వద్దగల ఇవిఎం గోదాములను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శనివారం తనిఖీ చేశారు. ప్రతి మూడు మాసాలకు చేసే తనిఖీల్లో భాగంగా గోదాములను సందర్శించి అక్కడ పరిస్థితిని నిశితంగా పరిశీలించారు. వివిధ పార్టీల ప్రతినిధులతో కలిసి గోదాముల లోపలగల వివి ప్యాట్లను, ఇతర సామగ్రిని తనిఖీ చేశారు. సిసి కెమెరాల పనితీరును గమనించిన ఆయన సిబ్బందికి, అధికారులకు పలు సూచనలు చేశారు. భద్రతా ప్రమాణాల్లో ఎటువంటి లోపమూ ఉండరాదని, అందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులు, భీమిలి ఆర్‌డిఒ ఎస్.భాస్కర్ రెడ్డి, రూరల్ మండల తహశీల్దార్ ఎం.శివన్నారాయణ, ఇవిఎం మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి, జిల్లా సహకార అధికారి టి.ప్రవీణ, ఎన్నికల విభాగం అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



గోదాముల్లో ఇవిఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్

మొదటి పేజీ తరువాయి..

డ్రగ్స్‌పై సమగ్ర విచారణ జరపాలి

అనిపించడం లేదని లోకనాథం తెలిపారు. ప్రైవేట్ సంస్థ కింద పోర్టు బెర్తులు వుండటం వల్ల ఇలాంటివి జరుగుతున్నాయన్నారు. ఆంధ్ర రాష్ట్రం ఇప్పుడు గంజాయి, డ్రగ్స్ సరఫరా చేసే రాష్ట్రంగా పేరొందుతోందన్నారు. దీనిని నియంత్రించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా బాధ్యతా రహితంగా ఉండటం శోచనీయమన్నారు. ఎన్నికల సమయంలో కోట్లాది రూపాయల మాదక ద్రవ్యాలు పట్టుపడడం ఆందోళన కలిగిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికైనా సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్టు సంస్థపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. వారు చేస్తున్న వ్యాపారాలపై కూడా దర్యాప్తు చేయాలన్నారు. ఈ సంఘటన వెలుగులోకి వచ్చి నాలుగు రోజులవుతున్నా ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. బాధ్యులను ఎందుకు కస్టడీలోకి తీసుకోకుండా జాప్యం చేస్తున్నారన్నారు.

వలస ఓటర్లే కీలకం

లేవు. ఈ ప్రాంతం అభివృద్ధికి దోహదపడతారని భావించే వ్యక్తికే ఓట్లు వేసే ఆనవాయితీ ఉంది. గత ఎన్నికల సరళిని పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. స్థానిక సమస్యలు పరిష్కరించే సత్తా ఉన్న నాయకులను అందలం ఎక్కించడం గతంలోనూ జరిగింది.



దీక్షల్లో కూర్చున్న హెచ్‌ఎంఎస్ నాయకులు

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపకపోతే బిజెపికి గుణపాఠం తప్పదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చర్యలను ఆపకుంటే కేంద్ర బిజెపికి రానున్న కాలంలో ప్రజలు తప్పక గుణపాఠం చెబుతారని హెచ్‌ఎంఎస్ స్టీల్‌ప్లాంట్ విభాగం అధ్యక్షులు డి.అప్పారావు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 1087వ రోజుకు చేరాయి. దీక్షల్లో హెచ్‌ఎంఎస్ కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ మూడేళ్లకుపైగా రాష్ట్రవ్యాప్తంగా ఉక్కు పరిరక్షణ ఉద్యమం సాగుతున్నప్పటికీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకోవాలన్నారు. మోడీకి మద్దతు ఇస్తున్న పార్టీలు కూడా పునరాలోచన చేయాలని హితవుపలికారు. దీక్షల్లో నాయకులు ఒనుము అప్పలరాజు, ద్వారపూడి ఈశ్వరరావు, డి.కనకరాజు, గొందేసి సత్యారావు, బత్తిన పెంటయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి చెన్నయ్ ఎగ్మోర్ - సంత్రాగచ్చి ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆదివారం నుంచి చెన్నయ్ ఎగ్మోర్ - సంత్రాగచ్చి మధ్య ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. అందుకు రైల్వే శాఖ ఏర్పాట్లు చేసింది. 06077 చెన్నై ఎగ్మోర్ - సంత్రాగచ్చి అన్ రిజర్వ్‌డ్ స్పెషల్ రైలు మార్చి 23, 30, ఏప్రిల్ 6 తేదీల్లో రాత్రి 23.00 గంటలకు చెన్నయ్ ఎగ్మోర్ నుండి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 13:54 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. మరలా 13:59 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 07.15 గంటలకు సంత్రాగచ్చి వెళుతుంది. 06078 సంత్రాగచ్చి - చెన్నయ్ ఎగ్మోర్ అన్ రిజర్వ్‌డ్ ప్రత్యేక రైలు మార్చి 25, ఏప్రిల్ 1, 6 తేదీల్లో ఉదయం 10:00 గంటలకు సంత్రాగచ్చి నుండి బయలుదేరి మరుసటి రోజు అర్ధరాత్రి 01:48 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. మరలా 01:50 గంటలకు బయలుదేరి అదేరోజు మధ్యాహ్నం 15.30 గంటలకు చెన్నయ్ ఎగ్మోర్ వెళ్తుంది.

పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు

ప్రజాశక్తి-ఎటపాక : మావోయిస్టు పార్టీ కిష్టారం ఏరియా కమిటీ డిప్యూటీ కమాండర్ మడివి ఊరలు అలియాస్ ఊర అల్లూరి జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ మేరకు ఎటపాక పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో రంపచోడవరం ఓఎస్‌డి కెవి.మహేశ్వర్‌రెడ్డి, చింతూరు సబ్ డివిజన్ ఏఎస్పీ రాహుల్ మీనా వివరాలు వెల్లడించారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం... చత్తీస్‌ఘడ్ రాష్ట్రం, సుకుమా జిల్లా కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధిలోని సాకిలేరు గ్రామానికి చెందిన మడివి ఊరలు అలియాస్ ఊర 2001లో మిలీషియా సభ్యుడిగా చేరగా, 2005లో దళ సభ్యుడిగా నియమించబడ్డారు. 18 ఏళ్ల పాటు మావోయిస్టు పార్టీలో సభ్యుడిగా ఉన్న ఊరలు ప్రస్తుతం కిష్టారం ఎల్‌వోఎస్ డిప్యూటీ కమాండర్‌గా పని చేస్తున్నారు. ఊరలు 2006లో దర్భగూడలో ఎర్రబోరు గ్రామానికి చెందిన ఇద్దరు సల్వాజుడం సానుభూతి పరులను, 2007లో ఇంజరం దగ్గరలో చీకకురు గూడెం గ్రామానికి చెందిన ముగ్గురు సల్వాజుడం సానుభూతిపరులను హత్య చేసిన ఘటనల్లో పాల్గొన్నాడు. 2006లో ఐఇడి పేలుడు ఘటనలోనూ పాల్గొన్నాడు.

పేరుకే రొయ్యల మేత.. !

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'కొనడం..అమ్మడం' అనే ప్రక్రియే ప్రాథమికంగా సమాజ వ్యతిరేకమైన కార్యకలాపం. ఆ రెండూ ఉన్నచోట మోసం మామూలుగా ఉండదు. అయితే ఈ ప్రక్రియలు లేకుండా సమాజాన్ని ఊహించడం సైతం కష్టసాధ్యమే. ఒక సరుకు ముసుగులో మరో సరుకును అక్రమంగా ఎగుమతి, దిగుమతి చేయడం దశాబ్దాల తరబడి నడుస్తోన్న తంతే. తాజాగా విశాఖ పోర్టులో ఈ తరహా మోసమే బయటపడింది. రొయ్యల ఎగుమతులు, దిగుమతుల పేర దేశంలో జరుగుతున్న సరుకు రవాణా వ్యాపారానికి విశాఖ కేంద్ర బిందువుగా నిలిచింది. ఈ నగరంలో కొనడం, అమ్మడం.. ఒకచోట నుంచి మరో చోటకు చేర్చడంలో జరుగుతున్న మోసాలు అన్నీ ఇన్నీ కావు. రూ.వందలు, వేల కోట్లు ఇలా చేతులు మారుతున్నాయి. వైజాగ్ పోర్టు, దీనికి పక్కనే ఉన్న ప్రైవేట్ కంటైనర్ టర్మినల్, ఇంకొంత దూరాన ఉన్న గంగవరం పోర్టు వంటి చోట్ల 'తీర వ్యాపారం' బలీయంగానే సాగుతోంది. అంతా సవ్యంగా ఉన్నంతవరకూ ఏ సమస్యా రాదు. తాజాగా విశాఖ నుంచి లావాదేవీలు నిర్వహిస్తున్న సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌పై వస్తున్న డ్రగ్స్ దందా ఆరోపణలు అందరికీ తెలిసినవే. బ్రెజిల్ దేశంలోని శాంటోస్ పోర్టు నుంచి డ్రై ఈస్ట్‌తో కలిపి 25 వేల కిలోల డ్రగ్స్ ఉండడంపై ఈ ఎగుమతి సంస్థపై సిబిఐ గరుడ ఆపరేషన్‌ను నిర్వహించింది. మొత్తం మాదకద్రవ్యాలను సీజ్ చేసింది. ఈ వ్యవహారంతో విశాఖపట్నం పేరు దేశ, విదేశాల్లో మార్మోగిపోయిందని చెప్పక తప్పదు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలైన వైసిపి, టిడిపి,



బిజెపిల జోక్యం ఏ మేరకు ఉందో ఒకరిపై మరొకరు విమర్శలు గుప్పించుకోవడం ద్వారా వెల్లడవుతోంది.

అంత డ్రై ఈస్ట్ మేతకు అవసరమా ?

సుమారు 25 వేల కిలోల డ్రై ఈస్ట్ రొయ్యల మేతకు అవసరం పడదన్న వాదన తాజాగా వినిపిస్తోంది. విశాఖ పోర్టునే ఎంచుకుని ఈ ఎగుమతి, దిగుమతులకు సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ సంస్థ పాల్పడిందన్న అంశాలపై సిబిఐ అధికారులు తాజాగా విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. కాకినాడలోగల సంధ్యా ఆక్వా పరిశ్రమపైనా 22న సోదాలు నిర్వహించారు. విశాఖపట్నం పోర్టుతో సదరు సంధ్యా ఆక్వా సంస్థ 20 ఏళ్ల క్రితం నుంచి కార్గో హేండ్లింగ్ చేపడుతున్నట్లు తెలుస్తోంది. రొయ్యల మేత కోసం డ్రై ఈస్ట్ ఎగుమతి, దిగుమతులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ దఫాయే ఇంటర్‌పోల్ సమాచారంతో సిబిఐ అధికారులు ఎందుకు ప్రవేశించి డ్రగ్స్ వ్యవహారం గుట్టు రట్టు చేశారన్న అంశంపైనా సాధారణ ప్రజల్లోనూ, రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశమైంది. వేల కిలోల డ్రై ఈస్ట్ సైతం ఎప్పుడూ రొయ్యల ఫీడ్‌కు అవసరం పడదని పలువురు చెబుతున్నారు. పక్కా ప్లాన్‌తోనే డ్రగ్స్ కోసం ఇంత పెద్ద మొత్తంలో డ్రై ఈస్ట్‌ను పైన పెట్టి వ్యాపారం సాగిస్తున్నారా ? అనే అనుమానాలూ ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. వైజాగ్ పోర్టునే సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ కంపెనీ ఎందుకు ఎంచుకుందన్నదానిపైనా సిబిఐ తాజాగా విచారణ చేపట్టినట్టు తెలుస్తోంది.

అనురాగ్ మాంటిస్సోరిలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



పట్టాలతో విద్యార్థులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ నడుపుతున్న అనురాగ్ మాంటిస్సోరి స్కూల్ గ్రాడ్యు యేషన్ డే వేడుకలు శనివారం విశాఖపట్నంలోని న్యూ రైల్ క్లబ్‌లో ఘనంగా జరిగాయి. స్నాతకోత్సవ కార్యక్రమానికి ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు మంజు ప్రసాద్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా డిఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పరిపాలన, అడ్మినిస్ట్రేషన్, టీచింగ్ మెథడాలజీలు, విద్యార్థుల గ్రూమింగ్ అత్యుత్తమంగా ఉన్నందుకు ప్రశంసించారు. కార్యక్రమంలో ఎడిఆర్‌ఎం (ఇన్‌ఫ్రా) సుధీర్ కుమార్ గుప్తా, ఎడిఆర్‌ఎం (ఆపరేషన్) మనోజ్ కుమార్ సాహూ, ఆర్గనైజేషన్ వైస్ ప్రెసిడెంట్ మధుస్మిత సాహూ పాల్గొన్నారు.

ఉబర్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించండి

రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల నేతలు డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉబర్ డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని, లేనిపక్షంలో విశాఖలో ఉండే ప్రజా సంఘాలన్నీ డ్రైవర్లకు మద్దతుగా ప్రత్యక్ష పోరాటాల్లో పాల్గొంటాయని శనివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. సమావేశంలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ ఉబర్ ఓనర్లు, డ్రైవర్లకు గతంలో ఇచ్చిన రేట్లు తగ్గించవద్దని, ప్లాట్‌ఫాం ఫీజు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో రాత్రి తిరిగే డ్రైవర్స్‌కు 50 శాతం అదనంగా ఇచ్చారని, అదే ఇవ్వాలని, వే-బిల్లు చూపించాలని కోరారు. క్యాబ్ ఓనర్స్ కమ్ డ్రైవర్స్ డిమాండ్లు న్యాయ సమ్మతమైనవని అన్నారు. ప్రతి డ్రైవర్ రూ.10 నుంచి రూ.15 లక్షల పెట్టుబడి పెట్టి కారు కొని ఉబర్‌లో లింక్ చేస్తే కంపెనీ ఏ రోజు ఎంత రేటు ఇస్తోందో తెలియని పరిస్థితి ఉందన్నారు. అలాగే కమీషన్ కూడా ఇష్టారాజ్యంగా తీసుకుంటున్నారని తెలిపారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ దగ్గర అంగీకరించిన అంశాలు కూడా అమలు చేయటం లేదన్నారు. పెట్టుబడి ఓనర్ కమ్ డ్రైవర్లది, లాభాలు ఉబర్ కంపెనీవని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉబర్‌కు కొమ్ము కాస్తున్నాయని విమర్శించారు. విశాఖలో వందలసార్లు కలెక్టర్, జిల్లా అధికారులను, ప్రజా ప్రతినిధులను డ్రైవర్లు కలిశారని, ఏ ఒక్కరూ ఉబర్ దోపిడీని


రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

అరికట్టలేదని ఆవేదన వెలుబుచ్చారు. గత్యంతరం లేక ఆరు రోజుల నుండి ఉబర్ డ్రైవర్లు సమ్మెకు దిగారన్నారు. వారిపై పోలీసులు ఎయిర్‌పోర్టు అధికారాలను ఉపయోగించి బెదిరిస్తున్నారన్నారు. ఇది సరైనది కాదన్నారు. ప్రతి యూనియన్ కలెక్టర్‌కు, జిల్లా మంత్రికి ప్రత్యేకంగా లేఖలు రాయాలని, బంద్‌కు మద్దతు తెలియజేయాలని, సోషల్ మీడియాలో ప్రచారం చేయాలని నిర్ణయించారు. విశాఖ క్యాబ్ యూనియన్ గౌరవ అధ్యక్షులు బి.జగన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కుమార్ తీర్మాణం ప్రవేశపెట్టగా మిగిలిన సంఘాల నాయకులు ఆమోదించారు. కార్యక్రమంలో వర్కింగ్ ఉమెన్ జిల్లా కన్వీనర్ పి.మణి, జివిఎంసి యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు, ఎల్‌ఐసి ఎంప్లాయీస్ యూనియన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్, బ్యాంకు యూనియన్ నాయకులు జివి.రమణ, మెడికల్ రిప్స్ యూనియన్ నాయకులు కెవిపి.చంద్రమౌళి, పోర్టు యూనియన్ నాయకులు సిహెచ్.త్రినాధరావు, బిల్డింగ్ యూనియన్ నాయకులు కె.నరసింగరావు, మోటారు యూనియన్ నాయకులు డి.అప్పలరాజు, మిడ్డేమీల్ జిల్లా అధ్యక్షులు బి.వరలక్ష్మి, కెవిపిఎస్ జిల్లా నాయకులు వై.రాజు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- మధురవాడ : ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, క్షయవ్యాధి ఒకపుడు ప్రాణాంతమైనప్పటికీ, ప్రస్తుతం వ్యాధి నిర్ధారణ, చికిత్స విధానాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రభుత్వపరంగా ఖరీదైన మందులు ఉచితంగా ఇవ్వడంతోపాటు ఆరునెలలపాటు ఆశాలు, వైద్యసిబ్బంది పర్యవేక్షణలో వీటిని వేయించే చర్యలు ప్రభుత్వపరంగా చేపడుతున్నట్లు వెల్లడించారు. రెండు వారాలకు మించి దగ్గు, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలుంటే దగ్గర్లోని ప్రభుత్వాసుపత్రిలో కఫం పరీక్షలు చేయించి, వ్యాధి నిర్ధారణ అయితే మందులు ఉచితంగా ఇస్తారన్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యసిబ్బంది సౌభాగ్యమణి, సత్యవతి, టిబి సూపర్‌వైజరు వీరబ్రహ్మం ,సురేష్, కృష్ణ, అనూష పాల్గొన్నారు



మధురవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

మునగపాక : ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పిహెచ్‌సి వైద్య సిబ్బంది శనివారం క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ గ్రామ వీధుల్లో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారి దుర్గాప్రవల్లిక మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు కనిపించిన వారు వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలోని వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ దేవకాంత, పీహెచ్ఎన్ అనూరాధ, ఆరోగ్య పర్యవేక్షకులు బిఎస్ఎన్ లక్ష్మి, ఎం ఉమామహేష్, టీబీ సిబ్బంది వెంకటరమణ, పద్మజ, పీహెచ్‌సీ సిబ్బంది తులసి, శిరీష, దేవకి, జగన్నాథరావు, విశ్వనాథం, ఆశా కార్యకర్తలు గౌరీ, రూప, వరలక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

రోలుగుంట: ప్రపంచ జాతీయ క్షయ(టీబీ) నిర్మూలన దినోత్సవాన్ని రోలుగుంట మండలం బుచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు సునీత, శ్రీనివాసరావు, టిబి సూపర్ వైజర్‌లు రాయ్, చక్రవర్తుల అధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పిలు, ఫార్మసీ ఆఫీసర్ కొండబాబు, ఏఎన్ఎంలు, ఆశలు, పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



ఎన్ఎడిలో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -కరాస: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం, డ్రగ్స్ వంటివి అక్రమంగా రవాణా జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. శనివారం విశాఖ జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్‌పి బి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ యు. సుబ్బారావు ఆధ్వర్యంలో ఎన్ఎడి బస్‌స్టాండ్, పరిసర ప్రాంతాల్లోని కొరియర్ సర్వీస్, ఇతర చోట్ల డాగ్ స్క్వాడ్ బందం సాయంతో ముమ్మర తనిఖీలు చేశారు. ప్రయాణికుల బ్యాగ్‌లను సోదా చేశారు.కార్యక్రమంలో సెబ్ ఇంటెలిజెన్స్ సిఐ రాజులు నాయుడు, ఎస్ఐలు జి.దాసు, వి.వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆరిలోవ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు విస్తృతంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. శనివారం హనుమంతవాక నుంచి అడివివరం వెళ్ళే బిఆర్‌టిఎస్ రహదారి హనుమంతవాక, పెదగదిలి, చినగదిలి, దీనదయాల్‌పురం, ఆరిలోవ వపు వెళ్ళే మార్గాల్లో బృందాలుగా ఏర్పడి వాహనాలను ఆపి నిశితంగా తనిఖీలు నిర్వహించారు.

నిబంధనల ఉల్లంఘన ఫిర్యాదుపై కేసు నమోదు..

ఆరిలోవ : ఎన్నికల కోడ్ అమలులో ఉండగా నిబంధనలకు విరుద్ధంగా ప్రజాప్రస్థానం పార్టీ పేరిట ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు పంపిణీ చేస్తున్నారని అందిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా తోట ముకుంద్ ప్రజాప్రస్థానం పేరిట ఆరిలోవ కాలనీ, లక్ష్మీనగర్‌లో కరపత్రాలు పంపిణీ చేసారని డిసిఓ సందీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసారు.

'అవంతి'లో ముగిసిన వర్క్‌షాప్



.వర్క్‌షాప్‌లో అవగాహన కల్పిస్తున్న రిసోర్స్‌పర్సన్

ప్రజాశక్తి- తగరపువలస : స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'ప్రింట్ 2 లెర్న్' అంశంపై రెండురోజుల వర్క్‌షాప్ శనివారం ముగిసింది. మెకా మార్విన్ స్టూడెంట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌కు రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించిన ఎల్.భవానీశంకర్ మాట్లాడుతూ ఎఫ్‌డిఎం, 3డి ప్రింటింగ్ ప్రాధాన్యతను వివరించారు. రంగం ఏదైనా నైపుణ్యాన్ని పెంచుకుంటే భవిష్యత్‌లో ఉన్నత ఉద్యోగాలు పొందవచ్చని విద్యార్థులకు సూచించారు. వర్క్‌షాప్‌కు కన్వీనర్‌గా డాక్టర్ అవినాష్ బెల్, కళాశాల డైరెక్టర్లు, డాక్టర్ బి.మురళీకృష్ణ, డాక్టర్ ఎ.చంద్రశేఖర్, ఎం లక్ష్మీశామిక పాల్గొన్నారు

సొసైటీ కార్మికులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి -ములగాడ : హెచ్‌పిసిఎల్ సొసైటీ కార్మికులకు తాను అండగా ఉంటానని పశ్చిమ నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ భరోసానిచ్చారు. శనివారం జివిఎంసి 58 వ వార్డు, శ్రీహరిపురం పిలకవానిపాలెం వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో హెచ్‌పిసిఎల్‌ఎస్ సర్వసభ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కార్మికులకు ఎటువంటి సమస్య వచ్చినా తన దృష్టికి తేవాలని, సంస్థ అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు ఎన్‌వి.రమణ, వైస్ ప్రెసిడెంట్ బి. చిన్నారావు, కార్యదర్శి ఎస్.పైడిరాజు, కోశాధికారి వై భాస్కరరావు, డైరెక్టర్లు సిహెచ్. శ్రీనివాసరావు, వై. అప్పలరాజు, ఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న ఆనందకుమార్

ఘనంగా మహిళా పాలిటెక్నిక్ వార్షికోత్సవం



ప్రశంసాపత్రం అందజేస్తున్న జెడ్‌సి కనక మహా లక్ష్మి

ప్రజాశక్తి -భీమునిపట్నం: స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. డిప్లొమా ఇన్ కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన అధిపతులు, సిబ్బంది ,విద్యార్థినిలు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో జెడ్‌సి కె కనక మహాలక్ష్మి పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా అనంతుని తెప్పోత్సవం

ప్రజాశక్తి -పద్మనాభం: మండలకేంద్రంలోని అనంత పద్మనాభస్వామి తెప్పోత్సవం శనివారం ఘనంగా జరిగింది. అనంత పద్మనాభస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాల్లో దేవస్థానం ఇఒ నానాజీబాబు ఆధ్వర్యంలో కుంతీమాధవ స్వామి ఆలయంలో ఉన్న శ్రీదేవికి భూదేవికి సమేత అనంతపద్మనాభ స్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ప్రతిష్టించి, దేవాలయం నుంచి పద్మనాభం రాజువీధిలో గ్రంథాలయం పోలీస్ స్టేషన్ మీదుగా కన్యయ్య కోనేరు వరకు ఊరేగింపు నిర్వహించారు.కన్యయ్య కోనేరులో సిద్ధంగా ఉన్న హంసవాహనంలో స్వామి తెప్పోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ పురోహితులు సీతారామాంజనేయులు, వేద పండితులు పర్యవేక్షణలో స్వామి మూడుసార్లు కోనేరులో విహరించారు. ఎంపిపి కె.రాంబాబు, జెడ్‌పిటిసి గిరిబాబు, వైసిపి మండల అధ్యక్షులు లక్ష్మణరావు, స్థానిక సర్పంచ్ టి.పాప దంపతులు స్థానిక ఎంపిటిసి లక్ష్మీ దంపతులు పాల్గొన్నారు. తెప్పోత్సవం సందర్భంగా భక్తులు అడుగడుగునా పులిహోరా ప్రసాదాలను పంచిపెట్టారు.

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 92వ వార్డు బంటా కాలనీలో శనివారం పలువురు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ సమక్షంలో వైసిపిలో చేరారు. కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసిపి విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నేతలు కడారి శ్రీనివాసరావు, అడ్డాల రామరాజు, ఆదిరెడ్డి మురళి, సత్తిబాబు పాల్గొన్నారు

డ్రగ్స్ రాజధానిగా విశాఖ

ప్రజాశక్తి- సీతమ్మధార : శాంతిభద్రతల పరిరక్షణలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే, ఉత్తర నియోజకవర్గ బిజెపి అభ్యర్థి విష్ణుకుమార్ ఆరోపించారు. ప్రశాంత విశాఖను గంజాయి, మాదక ద్రవ్యాలకు రాజధానిగా మార్చేశారని ఆక్షేపించారు. శనివారం సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే విజయవాడలో డ్రగ్స్ కంటైనర్ పట్టుబడిందని, ఇపుడు ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక విశాఖలో భారీ స్థాయిలో పట్టుబడిన డ్రగ్స్‌కు కులాలను ఆపాదించడం, బిజెపిపై బురద చల్లడం దుర్మార్గమన్నారు. మహిళలపై తాను చేసిన వ్యాఖ్యలను వైసిపి వక్రీకరించిందన్నారు. మహిళలంటే తనకు గౌరవమని, ఎవరి మనోభావాలైనా దెబ్బతింటే క్షమించాలని కోరారు. తనపై కెకె.రాజు పోలీసులకు ఫిర్యాదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు బిజెపి విశాఖ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత వైసిపి రంగులు, ఫ్లెక్సీలు తొలగించకపోవడం సరికాదన్నారు.

నెలాఖరులోగా పన్ను బకాయిల వసూలు

ప్రజాశక్తి-పిఎం పాలెం: జివిఎంసి జోన్ టూ పరిధిలో పన్ను బకాయిలను త్వరితగతన వసూలు చేయాలని రెవెన్యూ, పబ్లిక్ హెల్త్ విభాగం ఎడిసి వి.సన్యాసి రావు ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆరో వార్డు పరిధిలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జోన్‌లోని ఐదు నుంచి 13 వార్డులకు సంబంధించి ఇంటి పన్ను ఇప్పటికీ రూ.12 కోట్ల బకాయి ఉందన్నారు. మార్చి 31 లోపు ఇంటి పన్ను బకాయిలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు. వార్డులో పలుచోట్ల రెవెన్యూ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారా లేదా అని తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో జోన్ 2 రెవెన్యూ ఆర్‌వో మొగడ రాజు, బృంది పాల్గొన్నారు.

చెడ్డీగ్యాంగ్ హల్‌చల్‌తో భయాందోళన

ప్రజాశక్తి- ఆనందపురం: : మండలంలోని మచ్చవానిపాలెం గ్రామంలో శుక్రవారం రాత్రి చెడ్డీగ్యాంగ్ హల్‌చల్ చేసింది. . మచ్చవానిపాలెంలో రాత్రి 11 గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులు గ్రామంలోకి ప్రవేశించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు నాలుగు వాహనాల్లో హుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు. పోలీసులు చేరుకునేసరికి అపరిచిత వ్యక్తులు మాయమైనట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఇటీవల జిల్లాలో చెడ్డీగ్యాంగ్ సభ్యులు చోరీలకు పాల్పడుతుండతోపాటు ఒక వ్యక్తిపై దాడి చేసిన ఘటన జరగడం, ప్రజలను అప్రమత్తం చేస్తూ పోలీసులు హెచ్చరికలు జారీ చేయడం, ఈ నేపథ్యంలోనే అపరిచిత వ్యక్తుల సంచారంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కంటిమీద కునుకు లేకుండా పోతోందని ఆందోళన చెందుతున్న ప్రజలు, పోలీసుల గస్తీ, నిఘా పెంచాలని వేడుకుంటున్నారు.

భూఆక్రమణయత్నంపై ఆర్‌డిఒకు ఫిర్యాదు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఏళ్ల తరబడి తమ ఆధీనంలో ఉన్న భూములను కాజేసేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక ఆర్‌డిఒ ఎస్ భాస్కరరెడ్డికి శనివారం బాధితులు ఫిర్యాదు చేశారు. ఆనందపురం మండలం, ఆనందపురం, లొడగలవాని పాలెం పంచాయతీల్లో సుమారు 15 ఎకరాల భూమి దాదాపు 30 ఏళ్లుగా తమ అధీనంలో ఉండగా, ఆ భూమిలో అక్రమ నిర్మాణాలు జరిపేందుకు కొంత మంది ప్రయత్నిస్తున్నారని బాధితులు కె శ్రీను, ఎ.పైడిరాజు తదితరులు ఫిర్యాదులో ఆరోపించారు. తమ భూముల్లో డ్రోన్ కెమెరాతో ఫొటోలు తీస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. తమ భూములకు రక్షణ కల్పించాలని ఆర్‌డిఒకు ఇచ్చిన ఫిర్యాదులో కోరారు.

162 మందికి ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస: స్థానిక హైవేలోని శ్రీలక్ష్మి విజయ హాస్పిటల్ వద్ద శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖ జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో162 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు.60 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. వీరిని శంకర్ ఫౌండేషన్‌కు తీసుకు వెళ్లారు.శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి వైద్యసిబ్బంది జాక్సన్, క్యాంప్ కో ఆర్డినేటర్ వై రాజు, సచ్చంద సంస్థ ప్రతినిధులు వి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

జోరుగా వైసిపి అభ్యర్థుల ఎన్నికల ప్రచారం



వాకర్స్‌తో మాట్లాడుతున్న కెకె.రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 51వార్డులో కళింగనగర్ ఈస్ట్ పార్క్, ఎంఎస్ఆర్ పార్కుల వద్ద ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె రాజు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి పార్కుకు వచ్చిన వాకర్స్, సందర్శకులతో ముచ్చటించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, వైసిపి మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పేడాడ రమణకుమారి పాల్గొన్నారు.

45వవార్డు తాటిచెట్లపాలెం అభయాంజనేయస్వామి ఆలయంలో వార్డు సోషల్ మీడియా ఇన్‌ఛార్జి మాత ఈశ్వర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైసిపి ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు, ఎన్నిలక పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు. స్వామిని దర్శించు కున్నారు. వార్డు అధ్యక్షుడు పైడి రమణ, హరి పట్నాయక్, గణపతి, శ్యామ్, అప్పలరాజు, అనంత్, శెట్టి, రెడ్డి పాల్గొన్నారు.

అన్నసమారాధన

జివిఎంసి 54వ వార్డు మర్రిపాలెంలో నంబారు పైడిరాజు యాదవ్ ఆధ్వర్యంలో పాలగొలుపు ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె రాజు, స్టాండింగ్ కమిటీ సభ్యులు చల్లా రజిని ఈశ్వరరావు, కెపి రత్నాకర్, చిరంజీవి, సదరం జ్ఞానేశ్, లాయర్ ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

‘చొక్కాకుల’కు సత్కారం

విశాఖ ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావును 47వ వార్డు వైసిపి సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు, బూత్ కన్వీనర్లు,అభిమానులు ఘనంగా సత్కరించారు.

రాజుకు పలు సంఘాల మద్దతు

ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె. రాజుకు శనివారం పలు సంఘాలు నాయకులు మద్దతు తెలిపారు. ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయానికి వచ్చి కెకె.రాజును కలిసి, అభినందించి, వచ్చే ఎన్నికల్లో అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు మహమ్మద్ ఫరూఖి , పీలా ఉమారాణి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బూత్ ఏజెంట్లతో సమావేశం

ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె రాజు పోలింగ్ బూత్ ఏజెంట్లుతో సమావేశం నిర్వహించారు 25 వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ కర్రి మురళి కృష్ణారెడ్డి, నూకరాజు పాల్గొన్నారు.

ముమ్మరంగా ముత్తంశెట్టి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి- పద్మనాభం. మండలంలోని వికె. పాలెం, బాంధవపురం గ్రామాల్లో భీమిలి ఎమ్మెల్యే వైసిపి అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్లఎంతో కష్టపడి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారని, వచ్చే ఎన్నికల్లో ఓటేసి తనను మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారానికి వచ్చిన ముత్తంశెట్టికి మహిళలు హారతులిచ్చి ఘనస్వాగతం పలికారు. పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమిలి టిక్కెట్ సందీప్‌కు ఇవ్వాలి

ప్రజాశక్తి -పద్మనాభం : టిడిపి, జనసేన, బిజెపి పొత్తులో భాగంగా భీమిలి ఎమ్మెల్యే టిక్కెట్‌ను జనసేనకు కేటాయించి, నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న డాక్టర్ పంచకర్ల సందీప్‌కు ఇవ్వాలని పద్మనాభం మండల జనసేన అధ్యక్షులు కురిమిన రామస్వామి నాయుడు కోరారు. జనసేన ఆవిర్భావం నుంచి గడచిన పదేళ్లుగా డాక్టర్ సందీప్ పార్టీ తరపున ఎన్నో కార్యక్రమాలను చేపట్టారన్నారు. పాదయాత్ర చేసి, ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ఎంతో కృషి చేశారని, అలాంటి వ్యక్తికి జనసేన టిక్కెట్ ఇవ్వాలని, తామంతా సమిష్టిగా పనిచేసి గెలిపించుకుంటామని అన్నారు.

‘ఉక్కు’ పరిరక్షణ అంశాన్ని మ్యానిఫెస్టోలో పెట్టాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : ప్రయివేటీకరణ కాకుండా విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ అంశాన్ని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో పెట్టాలని పోరాట కమిటీ ఛైర్మన్ డి ఆదినారాయణ, శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ రిలే దీక్షలు 1136వ రోజున స్టీల్‌ప్లాంట్ సింటర్ ప్లాంట్ కార్మికులు దీక్షల్లోపాల్గొన్నారు.

ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, ఆంధ్రులపై వివక్షతోనే స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుకు కట్టబెడుతోందని విమర్శించారు. ఉత్పత్తికి అవరమైన ముడిసరుకు కొనుగోలు చేయకుండా, ఉత్పత్తిని కనిష్ట సాయికి తగ్గించి, బ్యాంకు రుణాలు ఇవ్వకుండా, వర్కింగ్ క్యాపిటల్ లేకుండా చేసి, అనేక ఉత్పత్తి విభాగాలు మూసివేసి నష్టాల బారిన నెట్టి సిక్ ఇండస్ట్రీగా ప్రకటించి మూసేయడమో, లేకుంటే ప్రయివేటుకు ధారాదత్తం చేయాలని చూస్తోందని, దీన్ని అందరం అడ్డుకోవాలన్నారు. అసెంబ్లీ తీర్మానం చేసి వైసిపి ప్రభుత్వం చేతులు దులుపుకుందని, అధికార పక్షంతోపాటు ప్రధాన విపక్షాలు ఈ అంశంపై కనీసం కేంద్రాన్ని ప్రశ్నించిన పాపాన పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో స్టీల్‌ప్లాంట్ అంశాన్ని మేనిఫెస్టోలో పెట్టిన పార్టీలకు కార్మిక వర్గం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డి ఆదినారాయణ, మూర్తి, నమ్మి సింహాద్రి,వెంకటేశ్వరరావు, గుమ్మడి నరేంద్ర శ్రీనివాస్ నాయుడు పాల్గొన్నారు,



దీక్షల్లో కూర్చున్న సింటర్ ప్లాంట్ కార్మికులు

విభజన హామీల సాధనలో వైఫల్యం



దివాకర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి-పెందుర్తి : విభజన హామీలను నెరవేర్చడంలో కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం మొండిచేయి చూపితే, దానిపై ప్రశ్నించి, ఒత్తిడి తెచ్చి సాధించడంలో రాష్ట్రంలోని అధికార, ప్రధాన విపక్షాలు పూర్తిగా విఫలమయ్యాయని కాంగ్రెస్ సీనియర్ నాయకులు వేగి దివాకర్ అన్నారు. శనివారం జివిఎంసి 96వ వార్డు పెందుర్తి కాంగ్రెస్ కార్యాలయంలో దివాకర్ పుట్టిన రోజు వేడుకను ఘనంగా నిర్వహించారు పలువురు నాయకులు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయిన ముందు అధికారంలోకి వచ్చిన టిడిపిగానీ, తర్వాత భారీ మెజార్టీతో అధికారంలోకి వచ్చిన వైసిపిగానీ ఏనాడూ విభజన హామీలపై కేంద్రాన్ని ప్రశ్నించలేక పోయాయన్నారు. విభజన తర్వాత రాష్ట్రాభివృద్ధి పూర్తిగా కుంటుబడిందని, అప్పుల ఊపులో ఆంధ్రా కూరుకుపోయిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదాతో అన్ని సమస్యలకు పరిష్కారం వస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్ డిక్లరేషన్ సభ జయప్రదం చూస్తుంటే కాంగ్రెస్‌కు పునర్వైభవం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు గొంప గోవింద్, అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు విన్నకోట రాము ఒబిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ఆర్ నాయుడు, సీనియర్ నాయకులు ఆడారి రమేష్ నాయుడు, షఫీ, లక్ష్మోజీ పాల్గొన్నారు

కెకెఆర్ గౌతమ్ పాఠశాలలో ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్‌పో

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు చిన ముషిడివాడ కెకెఆర్ గౌతమ్ పాఠశాలలో శనివారం సైన్స్ ఎక్స్‌పోను నిర్వహించారు. సైన్సు, పర్యావరణానికి సంబంధించి విద్యార్థులు రూపొందించిన పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కెకెఆర్ గౌతమ్ పాఠశాలల జోనల్ డీన్ కె.శేషుబాబు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. విద్యాబోధనలో భాగంగా పుస్తకాల్లోని పాఠ్యాంశాలను బట్టీ పట్టే విధానం కంటే, వాటిని ప్రాక్టికల్‌గా ఇలా ప్రాజెక్టుల రూపంలో తయారుచేసి వివరించగలిగితే వారికి సులభంగా అర్థమవ్వడమే కాకుండా గుర్తుంచుకోగలుగు తారన్నారు.



ప్రదర్శనను తిలకిస్తున్న ప్రిన్సిపల్

కార్యక్రమంలో ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు

ప్రతిభావంతమైన విద్యతో ఉన్నత శిఖరాలు



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న అతిథి

ప్రజాశక్తి -పిఎం పాలెం : ప్రతిభావంతమైన విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని రిటైర్డ్ రియర్ అడ్మిరల్ కె.రవి కిరణ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. జివిఎంసి 6వ వార్డు కొమ్మాది గాయత్రి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి ప్రొఫెసర్ సోమరాజుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించిన రవికిరణ్ మాట్లాడుతూ ఒకప్పుడు ఇంటికే పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని అది కేవలం విద్యతోనే సాధ్యమన్నారు. కార్యదర్శి సోమరాజు మాట్లాడుతూ గాయత్రి విద్యా పరిషత్ లాంటి గొప్ప కళాశాలలో చదువుకున్న విద్యార్థులు దేశ విదేశాలలో గౌరవప్రదమైన ఉద్యోగాల్లో ఉన్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు పురస్కారాలతో పాటు ధ్రువపత్రాలు అందజేశారు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ కె గోస్వామి, వివిధ విభాగాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఐపిఎల్ టిక్కెట్ల విక్రయాలు

- విశాఖలో 31, ఏప్రిల్ 3న రెండు మ్యాచ్‌లు

ప్రజాశక్తి -పిఎం పాలెం.: విశాఖపట్నంలోని వైఎస్ఆర్ ఎసిఎ విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నిర్వహించనున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్‌ల టిక్కెట్లను ఈ నెల 24 నుంచి ఆన్‌లైన్‌లో విక్రయించనున్నట్లు ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 31న ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య జరగనున్న మ్యాచ్‌కు 27వ తేదీ నుంచి పేటిఎం, పేటిఎం ఇన్‌సైడర్, ఢిల్లీ క్యాపిటల్స్ వెబ్‌సైట్ల ద్వారా ఆన్‌లైన్‌లో టికెట్లను కొనుగోలు చేయవచ్చని తెలిపారు. ఏప్రిల్ 3న ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య జరగనున్న మ్యాచ్ కోసం 24వ తేదీ, ఆదివారం ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉంటాయన్నారు. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన టికెట్లను పీఎం పాలెంలో ఉన్న స్టేడియం ‘బి’ గ్రౌండ్, నగరంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెడెమ్షన్ కౌంటర్లలో ఏప్రిల్ 3వ తేదీ మ్యాచ్‌కు 26 తేదీ నుంచి, ఈ నెల 31వ తేదీ మ్యాచ్ కోసం 27వ తేదీ ఉదయం 11 గంటల నుంచి రెడీమ్ చేసుకోవచ్చని సూచించారు.

టికెట్ల ధరలు ఇలా..

రూ. 7,500, రూ.5 వేలు, రూ. 3,500, రూ. 3వేలు, రూ.2,500, రూ.2వేలు, రూ.1,500, రూ.వెయ్యి విలువ చేసే టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న అమర్‌నాథ్

ప్రజాశక్తి -గాజువాక: అక్కిరెడ్డిపాలెం గ్రామంలో అపరిష్కృత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్రమంత్రి, గాజువాక వైసిపిఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. శనివారం 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో కార్పొరేటర్ గుడివాడ అనూష, వార్డ్ ఇన్‌ఛార్జి గుడివాడ లతీష్ ఆధ్వర్యం పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, తనను ఆదరించి, ఇంతటివాడిని చేసిన అక్కిరెడ్డిపాలెం అభివృద్ధి చేసి రుణంతీర్చుకుంటానన్నారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లలో గాజువాక ప్రాంతాన్ని బ్రహ్మాండంగా తీర్చిదిద్దామన్నారు. సంద్ర నూకరాజు, వరదడ చిట్టిబాబు, రెడ్డిపల్లి చిట్టిబాబు, డైరెక్టర్ రాజేష్, జోసెఫ్, ఈటి శ్రీరాములు, పొలవరపు శ్రీహరి, సత్యనారాయణచ ఇటి రంగారావు, వకపల్లి శేఖర్ పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన



ఆనందపురంలో నిర్వహిస్తున్న ర్యాలీ

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం ఎస్‌సి, బిసి కాలనీలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిడిపిఒ శ్రీదేవి, ఐసిడిఎస్ భీమునిపట్నం ప్రాజెక్ట్ సూపరవైజర్ వెంకటరత్నం, అంగన్వాడీ కార్యకర్త కాసులమ్మ, టీచర్ పి పద్మావతి పాల్గొన్నారు

మాధవధార : చిన్నరులతో పాటుగా గర్భిణులు, బాలింతలు పౌష్టిక ఆహారం అందిపుచ్చుకోవాలని ఐసిడిఎస్ అర్బన్ మర్రిపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ జెటీఎన్ జ్యోతి అన్నారు.శనివారం 51వ వార్డు గాంధీ నగర్ అంగన్వాడీ కేంధ్రంలో ‘పోషణ్ అభియాన్’లో భాగంగా పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులకు వెయ్యిరోజుల సంరక్షణను వివరించారు. చిన్నారులతో ఇసిసిఇ డే నిర్వహించి తల్లిదండ్రులకు పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ మౌలా బీబీ పాల్గొన్నారు.

మహిళా సమస్యలను పరిష్కరించాలి

ఐద్వా మహిళా మ్యానిఫెస్టో విడుదల

ప్రజాశక్తి- అనకాపల్లి

సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి వివిధ రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహిళా సమస్యలపై ఐద్వా రూపొందించిన మహిళా మేనిఫెస్టోను అనకాపల్లి బీసీ బాలికల హాస్టల్లో శనివారం ప్రభావతి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు, హింసను అరికట్టాలన్నారు. అత్యాచార నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా 30 రోజుల్లో విచారణ జరిపి కఠినమైన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. పెరిగిన కేసుల కనుగుణంగా కోర్టుల సంఖ్య పెంచాలని కోరారు. హాస్టల్లో సరైన వసతులు, ఆహార భద్రత ఉండే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ మైనార్టీ మహిళలకు ప్రత్యేక సదుపాయాలు కల్పించేందుకు పథకాలు ఉండాలని, ఒంటరి మహిళలను గుర్తించి వారికి గుర్తింపు కార్డు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మద్యం మత్తు పదార్థాలు నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి తదితర మత్తు పదార్థాలు నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని కోరారు. పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ చట్టం అమలు చేయాలని, అసంఘటిత మహిళా కార్మికులకు, స్కీం వర్కర్స్ కు కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా సంయుక్త కార్యదర్శి డిడి వరలక్ష్మి, మండల నాయకురాలు యు నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.



మహిళా మేనిఫెస్టోను విడుదల చేస్తున్న ఐద్వా నేతలు, విద్యార్థినులు

ఎన్నికల వ్యూహంపై సమావేశం

ప్రజాశక్తి-అనకాపల్లి

టిడిపి పార్లమెంట్ కమిటీ సభ్యులు, పట్టణ శాఖ ముఖ్య నాయకులతో శనివారం జనసేన పార్టీ కార్యాలయంలో కూటమి అభ్యర్థి కొణతాల రామకృష్ణ, టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు, పట్టణశాఖ అధ్యక్షులు డాక్టర్ కెకెవి.ఎ.నారాయణరావు ఆధ్వర్యంలో ఎన్నికల వ్యూహంపై శనివారం సమావేశం నిర్వహించి చర్చించారు. గతంలోని మున్సిపల్ వార్డుల ఆధారంగా టిడిపి, జనసేన, బిజెపి సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసి వాటి ద్వారా ఇంటింటి ప్రచార కార్యక్రమాలు, సభలు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కొణతాల వెంకట్రావు, కోట్ని రామకృష్ణ, కుప్పిలి జగన్, బోడి వెంకటరావు, కాండ్రేగుల సత్యనారాయణ, బొడ్డేడ మురళి, గుడాల సత్యనారాయణ, మళ్ల గణేష్, డివివి అప్పారావు, దొడ్డి జగదీశ్వరరావు, కొరిబిల్లి మహాలక్ష్మి, సాలపు నాయుడు, కొమ్మర్తి నారాయణరావు, కోయిలాడ గణేష్, విల్లూరి రమణబాబు, జంప మల్లికార్జునరావు, బుద్ద శ్రీనివాసరావు, పొలిమేర నాయుడు, దూలం ప్రసాద్, పెంటకోట వెంకటరమణ పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి- అచ్యుతాపురం

మండలంలోని వెదురువాడ గ్రామంలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త తనకాల అనంతరావు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేయనున్న ఇంటింటికి మహాలక్ష్మి పథకం గురించి ఓటర్లకు తెలియజేశారు. ఎన్నికల మేనిఫెస్టోను వివరిస్తూ ఇందిరమ్మ అభియం యాప్‌లో వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కుటుంబంలో ఒక మహిళకు రూ.5000 ఇవ్వనున్నట్లు చెప్పారు. ఒంటరి మహిళలకు సంవత్సరానికి లక్ష రూపాయలు పథకం అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎంవిఆర్ రాహుల్, మండల సోషల్ మీడియా ప్రతినిధి మణికంఠ, శరగడం దుర్గనాయుడు, భీశెట్టి పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఎన్నికల గ్రీవెన్స్ కేంద్రం

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లా కలెక్టరు కార్యాలయంలో ఎన్నికల గ్రీవెన్స్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు కమాండ్ కంట్రోల్ కేంద్రం నోడల్ అధికారి, మత్స్యశాఖ డి.డి పి.ప్రసాదు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 08924-22655599 నెంబర్‌తో ల్యాండ్ లైన్ ఫోన్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికలకు సంబంధించి ఏ గ్రీవెన్స్‌నైనా ఈ నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని పేర్కొన్నారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న టోల్ ఫ్రీ నెంబర్ 1950 కూడా అందుబాటులో వుంటుందని చెప్పారు. జిల్లాలో ఎన్నికలకు సంబంధించి గ్రీవెన్స్ తెలియజేయడానికి 24 గంటలు అందుబాటులో వుంటుందని చెప్పారు.

వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవీఎంసీ 82వ వార్డు బర్మకాలనీలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్‌ను గెలిపించాలని కోరుతూ శనివారం ఆ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, వాటిని చూసి వైసిపి అభ్యర్థి మలసాల భరత్ కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి- కశింకోట : బాల్య వివాహాలను అరికట్టాలని ఐసిడిఎస్ అనకాపల్లి సిడిపిఓ ప్రభావతి అన్నారు. కసింకోట ఆరోగ్య కేంద్రం వద్ద బాల్య వివాహాలపై సిబ్బందికి, ఆశ కార్యకర్తలకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. చిన్న వయస్సులో వివాహాలు చేయడం నేరమని, గ్రామాల్లో జరిగే కార్యక్రమాల్లో ఈ విషయాలపై తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తిరుపతిరావు, వైద్య సిబ్బంది సత్యనారాయణ, సత్యవతి, సుభాని, సెక్టార్ సూపర్వైజర్లు సుచరిత ఆదిలక్ష్మి, వంశీ ప్రియ, ప్రధాన ఉపాధ్యాయులు స్వర్ణకుమారి పాల్గొన్నారు

ఉచిత పశువైద్య శిబిరం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : హెరిటేజ్ డెయిరీ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని భోగాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పాడి రైతులతో సమావేశమై హెరిటేజ్ డెయిరీ రైతులకు అందిస్తున్న పలు సంక్షేమ పథకాలు గురించి వివరించారు. పాడి రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లనుఅందజేశారు. డెయిరీ డాక్టర్ మనోజ్ కుమార్ 30 పశువులకు డి వార్మింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సిహెచ్.రాము, ఆర్ రమణ, డి శ్రీను, పి సంజీవరావు, కె వెంకటరావు, డి సన్యాసిరావు, పి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు

జిల్లా ఎస్‌పి కెవి.మురళీకృష్ణ

ప్రజాశక్తి-అనకాపల్లి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్ట్‌ల వద్ద పోలీసులు, కేంద్ర పోలీస్ బలగాలు సంయుక్తంగా తనిఖీలు ముమ్మరం చేయాలని జిల్లా ఎస్పి కెవి.మురళీకృష్ణ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ శనివారం నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. దర్యాప్తులో ఉన్న సాధారణ, తీవ్రమైన కేసులు, ప్రాపర్టీ కేసులు, పోక్సో యాక్ట్ కేసులు, 174 సి.ఆర్.పి.సి. కేసులు, గంజాయి కేసులు, మిస్సింగ్ కేసులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించారు. ఆయా కేసుల్లో దర్యాప్తు పెండింగులో ఉండడానికి గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొని, త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయుటకు పలు సూచనలు చేశారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనలను ఏమాత్రం ఉల్లంఘించిన కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. పోలీస్ సిబ్బంది ఎలాంటి అలసత్వం వ్యవహరించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. జిల్లాలోని 9 చెక్ పోస్ట్‌ల వద్ద తనిఖీలు నిర్వహించి మాదకద్రవ్యాలు, నాటు సారా, మద్యం అక్రమ రవాణా నిరోధించడం, నగదు, ఉచిత కానుకలు తదితర వస్తువులను అరికట్టాలని ఆదేశించారు. ఎన్ఫోర్స్‌మెంట్ కేసులు నమోదు చేయాలన్నారు. రౌడీ షీటర్‌లు, చెడు నడత కలిగిన వారిపై బైండోవర్‌లు చేయించాలన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన ఆరుగురు అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలతో జిల్లా ఎస్పీ సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయ భాస్కర్, పి.సత్యనారాయణరావు, డిఎస్‌పిలు ఎస్.అప్పలరాజు, కెవి.సత్యనారాయణ, బి.అప్పారావు, పి.నాగేశ్వరరావు, ట్రైనీ డీఎస్పీ భవ్య, ఇన్‌స్పెక్టర్‌లు లక్ష్మణ మూర్తి, చంద్ర శేఖర్, అప్పలనాయుడు, గణేష్, కుమారస్వామి, ఎస్సైలు రామారావు, రఘువర్మ, జిల్లాలోని ఇతర సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పి మురళీకృష్ణ



మాట్లాడుతున్న ఎడిఆర్ డాక్టర్ జగన్నాధరావు

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-అనకాపల్లి

నాణ్యమైన విత్తనాలతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ పివికె జగన్నాధరావు పేర్కొన్నారు. ఆర్ఏఆర్ఎస్‌లో శనివారం శిక్షణ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ విత్తనాల ఎంపికలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి బి మోహన్‌రావు మాట్లాడుతూ రబీ సీజన్లో నువ్వులు, జనుము పంటలు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. పప్పు ధాన్యాలు, నువ్వులు, జనుము పంటకు ప్రస్తుతం మార్కెట్లో గిరాకీ ఉందని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, జిల్లా డివిజన్ వ్యవసాయ అధికారులు ప్రస్తుతం వ్యవసాయంలో ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు డాక్టర్ ముకుందరావు, డి ఆదిలక్ష్మి, టి శ్రీలత, విశాలాక్షి, ఉమామహేశ్వరరావు, శిరీష ప్రసంగించారు.

మోడల్ స్కూల్లో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- కశింకోట

కసింకోట మండలం తేగాడ మోడల్ స్కూల్లోని ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మారుతి తిలకం శనివారం ఒక ప్రకటనలో కోరారు. 10వ తరగతి పాసైన వారు దీనికి అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 28 నుండి మే నెల 25 వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పదో తరగతి మార్క్ లిస్ట్ జత చేయాలన్నారు. ఓసి, బిసిలకు రూ.200, ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.150 ఫీజు చెల్లించాలని కోరారు.

క్రికెట్ బెట్టింగ్, మత్తుమందు స్మగ్లింగ్‌కు అడ్డుకట్ట వేయాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

క్రికెట్ బెట్టింగ్ దారులకు, విద్యార్థులను చెడగొట్టే మత్తుమందు స్మగ్లర్లకు అడ్డుకట్ట వేయాలని కోరుతూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో డీఎస్పీ ఎస్ అప్పలరాజుకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఐపీఎల్ క్రికెట్ సీజన్ ప్రారంభం కావడంతో బెట్టింగ్ దారులు రెచ్చిపోతారని, యువతపై దీని ప్రభావం ఎక్కువ ఉంటుందని తెలిపారు. అలాగే పలు ప్రాంతాల్లో మద్యం సేవించి ఆకతాయిలు, మత్తు పదార్థాలు సరఫరా చేసే స్మగ్లర్లను అదుపు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు డాక్టర్ చిన్ని యాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, బొబ్బిలి గోవిందరాజులు, సరికి చిరంజీవి, ముగడ అప్పారావు, నమ్మి అమ్మతల్లి నాయుడు, పట్నాల సాయి, చింతా లక్ష్మణ్ పాల్గొన్నారు.

'సెయింట్ జాన్స్'లో స్నాతకోత్సవం

ప్రజాశక్తి - కశింకోట : కశింకోట సెయింట్ జాన్స్ పాఠశాలలో యూకేజీ విద్యార్థుల స్నాతకోత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ బత్తుల అనురాధ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రూపానంద్ తదితరులు పాల్గొన్నారు.



యుకెజి విద్యార్థుల స్నాతకోత్సవంలో పాల్గొన్న చిన్నారులు

మోడీ ప్రభుత్వంలో వ్యవస్థల విధ్వంసం

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేషు

ప్రజాశక్తి- అనకాపల్లి

దేశంలో నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వ్యవస్థలను విధ్వంసం చేశారని ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేష్ ఆరోపించారు. ఏఐటియుసి అనకాపల్లి జిల్లా ప్రథమ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన నేపథ్యంలో శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సంపదను సృష్టిస్తున్న 50 కోట్ల మంది కార్మికులను ఆదుకునే చర్యలు లేకపోగా వారిని ఇబ్బంది పెట్టే అనేక చర్యలకు కేంద్ర ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. భారత్‌ను మూడవ ఆర్థిక దేశంగా తీర్చిదిద్దామని మోడీ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 85 కోట్ల మంది పేద ప్రజలకు ఉచిత రేషన్ ఇస్తూ ప్రపంచంలోనే మూడవ ఆర్థిక దేశంగా ఎలా అయిందని ప్రశ్నించారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తూ వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తూ దేశాన్ని నాశనం చేస్తున్నాడని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా బిజెపికి సహకరిస్తున్న టిడిపి, జనసేన, వైసిపి లాంటి పార్టీలను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటియుసి నాయకులు డాక్టర్ బూసిరాజు, అచ్యుతరావు, వైఎన్. భద్రం, సమితి సభ్యులు గనిశెట్టి ఏసుదాసు, కోన లక్ష్మణ, ఎల్సి రమణ, పెంటకోట సత్యనారాయణ, సిపిఐ నాయకులు బాలేపల్లి వెంకటరమణ, రాజాన దొరబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేషు



ర్యాలీ నిర్వహిస్తున్న గవిరెడ్డి గ్రూపు టిడిపి నేతలు, కార్యకర్తలు

గవిరెడ్డికి టికెట్ ఇవ్వాలని ర్యాలీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మాడుగుల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడుకు ఇవ్వాలని కోరుతూ దేవరాపల్లి మండల కేంద్రంలో రామానాయుడు గ్రూపునకు చెందిన టిడిపి నాయకులు కార్యకర్తలు శనివారం నిరసన ర్యాలీ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి మహేశ్వరి థియేటర్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో లోకల్ ముద్దు.. నాన్ లోకల్ వద్దు అంటూ నినాదాలు చేశారు. మాడుగుల టిడిపి టికెట్‌పై పార్టీ అధినేత చంద్రబాబు పునరాలోచన చేయాలని, లేకుంటే ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఈ ర్యాలీలో మాజీ సర్పంచులు సోమిరెడ్డి గోవింద, బొడ్డు వెంకటరావు, రాయవరపు సాంబమూర్తి, గంధం జగన్, పూడి సత్యారావు, కొరుప్రోలు రామలింగేశ్వరరావు, నరసింహనాయుడు, మాజీ ఎంపీటీసీ మలిరెడ్డి రాజనాయుడు, దొగ్గ రమేష్, గ్రామ అధ్యక్ష కార్యదర్శులు అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భౌతికశాస్త్ర పరీక్షకు 98 శాతం మంది విద్యార్థుల హాజరు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన పదో తరగతి భౌతిక శాస్త్ర పరీక్షకు సుమారు 98 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. 108 పరీక్ష కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 21,258 మందికిగాను 21,139 మంది, ప్రైవేట్ విద్యార్థులు 1617కుగాను 1229 మంది, మొత్తం 22,875 మందికి గాను 22,368 మంది హాజరయ్యారని ఆమె పేర్కొన్నారు. పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు నాలుగు కేంద్రాలు, 8 స్క్వేడ్ బృందాలు 30 కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. కాగా పరీక్ష కేంద్రాల వద్ద జరుగు పోలీస్ బందోబస్తును అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్ పర్యవేక్షించారు.

ఘనంగా పోతురాజు గావు పండగ

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని కింతాడ శివారు గొల్లలపాలెం గ్రామంలో పోతురాజుస్వామి గావు పండుగ శనివారం భక్తి శ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా పోతురాజు స్వామి గుడి వద్ద వేసిన పందిరికి వివిధ గ్రామాల ప్రజలు అరటి గెలలు, బెల్లం దిమ్మలు, గుమ్మడికాయలు, బీరలు, నగదు, కొబ్బరి గెలలు వేలాడదీశారు. ఉదయం నుండి తప్పుడు గుళ్ళు కళాకారుల ప్రదర్శనలు జరిగాయి. ఈ కళాకారులను మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు తిలకించి ఆర్థిక సహాయం అందజేశారు. మధ్యాహ్నం భారీ స్థాయిలో అన్నసమారాధన, పందిరి దోపిడీ కార్యక్రమాలు జరిగాయి.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక నందీశ్వర కళావేదికపై శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామానికి చెందిన కీర్తిశేషులు డాక్టర్ మళ్ల మురళీకృష్ణ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరం ఉదయం 9 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు కొనసాగింది. శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు డాక్టర్ పివి సత్యనారాయణ, భరద్వాజ్, సతీష్ కుమార్, శ్రీనివాస్ తేజస్విని, కెఆర్ఎస్‌వి సన్యాసినాయుడు, కే.జ్ఞానేశ్వరి, కె.రవికుమార్, పి రాజేశ్వరి, పి.విశ్వనాథ్, యశోద లక్ష్మి, బొడ్డేడ మంజుష పాల్గొన్నారు.



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు

అక్రమంగా నిల్వ ఉంచిన కెమికల్స్ పట్టివేత

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ తిమ్మయ్యపాలెం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన థియోనిల్ క్లోరైడ్ కెమికల్స్‌ను పోలీసులు పట్టుకున్నారు. పరవాడ సిఐ బాల సూర్యారావు తెలిపిన వివరాలు ప్రకారం... తిమ్మయ్యపాలెం గ్రామానికి చెందిన పైలా జగదీశ్వరరావు అనే వ్యక్తి తన ఇంటి వెనుక ఉన్న దీపురపల్లి దేముడుకు చెందిన కొబ్బరితోటలో 60 నీలం రంగు ప్లాస్టిక్ డబ్బాలలో సుమారు 8వేల కేజీల థియోనిల్ క్లోరైడ్ అను కెమికల్స్‌ను, 20 నీలం రంగు ప్లాస్టిక్ డబ్బాలలో సుమారు 3వేల కేజీల మిక్స్‌డ్ అవశేషాలు రసాయనాన్ని నిల్వ చేశారు. ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా, చుట్టుపక్కల గ్రామంలో నివసించే ప్రజలకు హానికరం అని తెలిసి కూడా నిల్వ ఉంచినట్లు సిఐ బాలసూర్యారావుకు అందిన ముందస్తు సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. నిల్వ ఉంచి కెమికల్స్‌ను స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోనికి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ బాల సూర్యారావు తెలిపారు.



పట్టుబడిన కెమికల్స్



కె.కోటపాడు ఎంపిపికి వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టుల నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్ : ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఏపీయూడబ్ల్యూజె) ఆధ్వర్యంలో శనివారం నర్సీపట్నంలో జర్నలిస్టుల కోర్కెల దినంలో భాగంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజె రాష్ట్ర నాయకులు సిహెచ్‌బిఎల్.స్వామి మాట్లాడుతూ, మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. మీడియా సంస్థలు, జర్నలిస్టు భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్‌కు యాజమాన్యాలు కనీస వేతనాలు ఇవ్వాలని, 60 సంవత్సరాలు ఉన్న విలేకర్లకు కనీసం రూ.5వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ప్రెస్ క్లబ్ సెక్రటరీ బేరా బాబ్జీ, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ నర్సీపట్నం ఏరియా అధ్యక్షుడు విజయ్, నర్సీపట్నం ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు మడ్డు రామకృష్ణ, జాయింట్ సెక్రెటరీ పసుపులేటి ప్రభాకర్, పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని జర్నలిస్టుల దేశవ్యాప్త కోర్కెల దినోత్సవం సందర్భంగా జర్నలిస్టుల సమస్యలను ఎన్నికల ప్రణాళికలో చేర్చాలని కోరుతూ శనివారం మండలంలోని జర్నలిస్టులు ఎపియుడబ్ల్యూజె ఆధ్వర్యాన ఎంపీపీ రెడ్డి జగన్ మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు కుబిరెడ్డి రాధాకృష్ణ, చోడవరం ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి నేమాల సతీష్ మాట్లాడుతూ మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టుల, మీడియా సంస్థల భద్రతకు జాతీయస్థాయిలో ఒక ప్రత్యేక చట్టం చేయాలని, వర్కింగ్ జర్నలిస్టుల వేతన సవరణ కోసం వేజ్ బోర్డును నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు జి.బాల గంగాధర్, ఎస్.వెంకటరావు, డి.నరసింగరావు, ఎస్.సతీష్, ఎన్.శ్రీను, ఎస్.నారాయణ, బి.సత్యనారాయణ, ఎస్.అప్పారావు, వి.పరమేష్, జి.రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ నేషనల్ లీగల్ కాంపిటీషన్



మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీలో లీగల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యాన క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్-5.0 నేషనల్ లీగల్ కాంపిటీషన్ శనివారం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణ మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో రాబోయే సవాళ్ల ఎదుర్కోవడం కోసం క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ యొక్క ప్రాముఖ్యత వేదికను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దర్యాప్తు అధికారి క్రైమ్ సీన్ అబ్జర్వేషన్‌లో నిందితులను గుర్తించడంలో ముఖ్య పాత్ర వహిస్తుందని తెలిపారు. ఇటువంటి పోటీల వలన కళాశాల విద్యార్థులకు విజ్ఞానం, నైపుణ్యం మెరుగుపర్చుకోవచ్చని చెప్పారు. కేసులు దర్యాప్తు, చట్టాల అమలుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.సూర్య ప్రకాష్‌రావు, ఇంచార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ నందిని, కో కన్వీనర్ డాక్టర్ సిహెచ్.లక్ష్మి, లా యూనివర్సిటీ ఫ్యాకల్టీ మెంబర్స్, పరవాడ సబ్ స్టేషన్ డీఎస్పీ కెవి.సత్యనారాయణ, స్థానిక సిఐ పిన్నింటి రమణ తదితరులు పాల్గొన్నారు.

పంచలోహ విగ్రహ ప్రతిష్ట ఉత్సవ కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈనెల 27, 28 తేదీల్లో జరగనున్న అనకాపల్లి కుంచావారి గౌరీ పరమేశ్వరుల పంచలోహ ఉత్సవ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం కరపత్రాన్ని శనివారం టౌన్ పోలీస్ స్టేషన్లో పట్టణ సిఐ జి.శంకర్రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవకమిటీ చైర్మన్ ఎం వీరభద్రరావు (అబ్బులు) మాట్లాడుతూ ప్రముఖ వ్యాపారవేత్త మావూరి వెంకటరమణ పద్మావతి ఆర్థిక సహకారంతో 250 కేజీల పంచలోహ విగ్రహం తయారు చేయించినట్లు చెప్పారు. 27న పంచలోహ ఉత్సవ విగ్రహం ఊరేగింపు, 28, 108 కలశ సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, మధ్యాహ్నం ప్రముఖ బిల్డర్ కాండ్రేగులనాయుడు భాగ్యలక్ష్మి దంపతులు ఆర్థిక సహకారంతో భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పొండంకి సత్యారావు, కోరుకొండ సాంబశివరావు, కొమ్మోజి రామకృష్ణ, పాలూరి శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిఐ శంకరరావు తదితరులు

స్కీమ్ కార్మిక సంఘం నాయకుడు అప్పలనాయుడుకు నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి : స్కీమ్ కార్మిక సంఘం నాయకుడు కోడిరోతు అప్పలనాయుడుకు ఘనంగా నివాళులర్పించారు. అప్పలనాయుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా, మండలంలోని మార్టూరు గ్రామం, గుంకలోవ కాలనీలో శనివారం సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. అప్పలనాయుడు చిత్ర పటానికి ఏఐఎఫ్‌టియూ (న్యూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆడారి అప్పారావు పూలమాల వేసి నివాళ అర్పించారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్కీమ్ కార్మిక సంఘం కార్యదర్శి గడి సూర్యారావు, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కన్వీనర్ ఓ లక్ష్మి కుమారి, నవయువ సమాఖ్య జిల్లా నాయకులు నందారపు భాస్కరరావు, జన సాహితీ జిల్లా అధ్యక్షులు బిటిఆర్సి శివాజీరావు, అప్పలనాయుడు కుమారుడు ప్రసాద్, సంఘం నాయకులు దాడి జగ్గారావు, కరణం తవిటమ్మ పాల్గొన్నారు.

ఉపాధి హామీ బకాయిలు చెల్లించరూ...

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల వ్యాప్తంగా గడిచిన 5 వారాల నుంచి ఉపాధి పనులు జరుగుతున్నాయి. ఉపాధి కూలీలకు కూలి వేతనాలు అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఏపీవో గంగు నాయుడును సంప్రదించగా మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో గుర్తించిన పనులు ప్రస్తుతం జరుగుతున్నాయని తెలిపారు. అదే విధంగా 2024-25 సంవత్సరానికి గాను 950 పనులు గుర్తించామని తెలిపారు. గడిచిన 5 వారాలుగా కైలాస పట్నం మినహా అన్ని గ్రామాల్లో పనులు జరుగుతున్నాయన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి సుమారు రూ.45 లక్షల వరకు బకాయిలు అందజేయాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే వాటికి సంబంధించి అప్లోడ్ చేయడం జరిగిందన్నారు. ఏప్రిల్ నుంచి కొత్తగా గుర్తించిన పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా తెలిపారు.



పనులు చేపడుతున్న కూలీలు



క్యూలో ఉన్న భక్తులు

వెంకన్న ఆలయం కిటకిట

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న వార్షిక తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. సుధూరు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ వేద పండితురాలు, డాక్టర్ గాయత్రి దేవి ఆధ్వర్యంలో ఆలయంలో విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం చేశారు. మహిళల కోలాట ప్రదర్శన భక్తులను ఎంతగానో అలరించింది.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - చీడికాడ:2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి ఏడాది ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చెరకాపు వెంకట లక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ, ఆదర్శ పాఠశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిండచంతో పాటు ఆంగ్ల మాధ్యమంలో ఉచితంగా విద్యా బోధన అందిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ /ప్రైవేటు పాఠశాలల్లో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 28 నుంచి మే 22 వరకు ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 దరఖాస్తు రుసుము చెల్లిం చాలన్నారు. అనంతరం విద్యార్థికి కేటాయించే జనరల్ నంబరు సంబంధిత వెబ్సైట్లో దరఖాస్తు సమర్పించాలని సూచించారు. మార్కుల మెరిట్, రిజర్వేషన్ రూల్స్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామని ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి పేర్కొన్నారు.



ప్రిన్సిపాల్ వెంకట లక్ష్మి

నేడు కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలో శ్రీవిద్య వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ (విశాఖపట్నం) సహకారంతో ఈనెల 24నఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్యాంపు కోఆర్డినేటర్ అశ్విని కుమార్ తెలిపారు. విద్యా వికాస్ పాఠశాల ఆవరణలో శిబిరం నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ పాపా సాహెబ్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యశిబిరం నిర్వహిస్తామన్నారు.



సస్పెండ్ ఉత్తర్వులను అందజేస్తున్న అధికారులు

ఆలయ పూజారి సస్పెన్షన్

ప్రజాశక్తి -అనకాపల్లిడెస్క్:సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ప్రభుత్వ ఉద్యోగి, గొలుగొండ మండలం లింగంపేట నూకాలమ్మ ఆలయ పూజారి గొలుకొండ త్రిమూర్తులును సస్పెండ్ చేస్తున్నట్లుగా దేవాదాయ శాఖ ఈవో గంగారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మేజర్ పంచాయతీ ఏఎల్ పురంలో వైసిపి పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సమావేశంలో పాల్గొనడంతో త్రిమూర్తులపై టిడిపి నాయకులు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్డిఓ జయరాంకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో దేవదాయ శాఖ అధికారులు దర్యాప్తు అనంతరం శనివారం ఆయనను సస్పెండ్ చేస్తున్నట్లుగా ప్రకటించి ఆ ఉత్తర్వులను పూజారి త్రిమూర్తులకు అధికారులు అందజేశారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

ప్రజాశక్తి -అనకాపల్లిడెస్క్:ఎమ్మెల్యే, ఎంపి స్థానాలకు జరుగనున్న ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు వీలుగా ఎస్.రాయవరం మండలంలోని పలు గ్రామాలలో పోలీసు కవాతు నిర్వహించారు. నక్కపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ అప్పన్న, ఎస్ఐ విభీషణరావు ఆధ్వర్యాన పారామిలటరీ బలగాలతో యస్.రాయవరం, సైతారుపేట, సర్వసిద్ధి, జంగులూరు. వెలంపాలెం గ్రామాలలో పోలీసుల కవాతు నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో గ్రామాలలో ఎటువంటి అరాచకాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని సిఐ అప్పన్న హెచ్చరించారు. ఎన్నికలు స్వేచ్ఛగా, శాంతియుతంగా జరిగేందుకు గ్రామస్థులు సహకరించాలని సూచించారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం, నజరానాల పంపిణీపై ఎన్నికల కమీషన్ సూచనల మేరకు చర్యలు తప్పవన్నారు.



కవాతు చేస్తున్న పోలీసులు

నిలిచిన తాగునీటి సరఫరా

అవస్థలు పడుతున్న మహిళలు




ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి- అనకాపల్లిడెస్క్:ఎస్.రాయవరం మండల కేంద్రంలోని తాడేల వీధిలో గత 15రోజులుగా కుళాయిల నుంచి తాగునీరు సరఫరా కాలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం టీడీపీ మండల మహిళా అధ్యక్షులు కొమ్మిరెడ్డి నాగలక్ష్మి మాట్లాడుతూ, పంచాయతీ సిబ్బందికి ఎన్నిసార్లు తెలిపినా పట్టించుకోలేదన్నారు. కులాయిలు మరమ్మతు చేస్తామని గోతులు తీసి వదిలేయడంతో చిన్నపిల్లలు, వృద్ధులు పడిపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పంచాయతీ సిబ్బంది మేలుకొని తాగనీరు వచ్చే విధంగా చూడాలని కోరుతున్నారు.

టాలెంట్ టెస్టులో వర్షిణి ప్రతిభ

ప్రజాశక్తి -అనకాపల్లిడెస్క్:ఈ నెల 18న (రాజమహేంద్రవరం)లో జరిగిన తెలుగు టాలెంట్ టెస్ట్లో ఎస్.రాయవరం వినయ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థికి రెండవ స్థానం వచ్చినట్టు స్కూల్ ఒలంపియాడ్ ఇంఛార్జి కొలగాని వరప్రసాద్ తెలిపారు.



శనివారం అయన మాట్లాడుతూ, పాఠశాలలో చదువుతున్న అమృత వర్షిణి (9వ తరగతి) రాష్ట్ర స్థాయిలో రెండవ సాధించిండం తమకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. అమృతను కరస్పాండెంట్ వాసు, ప్రిన్సిపాల్ అప్పారావు అభినందించారు.



మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ

'ఐదేళ్ల కాలంలో అభివృద్ధి ఏదీ'

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:ఐదేళ్ల పాలనంలో వైసీపీ చేసిన అభివృద్ధి ఏదీ ఏదని గొలుగొండ మాజీ జడ్పిటిసి చిటికెలు తారక వేణుగోపాల్ విమర్శించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఏఎల్పురం గ్రామంలోనే 55 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం, బస్సు షెల్టర్, అంగన్వాడి కేంద్రాలు, అల్లూరు పార్కు అభివృద్ధి, హైస్కూల్లో కంటైనర్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ వంటి అభివృద్ధి అయ్యన్నపాత్రుడు ఐదేళ్లలో చేశారని తెలిపారు. అయ్యన్నను విమర్శించే స్థాయి ఎమ్మెల్యే గణేష్కి లేదన్నారు. గ్రామంలోని వంద కుటుంబాలు టిడిపి నుండి వైసీపీలోకి చేరారని చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఐదేళ్లలో మూడు కిలోమీటర్ల ఆరిలోవ రోడ్డు వేయలేని స్థితిలో వైసిపి ప్రభుత్వం ఉందని ఆరోపించారు. ఎంపీటీసీ రుత్తర శివరామకృష్ణ మాట్లాడుతూ, అయ్యన్నపాత్రుడు 150 పడకల ఆసుపత్రి ఇచ్చారని ఒప్పుకున్నప్పటికీ కనీసం లిఫ్ట్ సౌకర్యం కూడా కల్పించలేని స్థితిలో ఎమ్మెల్యే ఉన్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గొంప వాసు, లగుడు రమేష్ బొడ్డు జమీలు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:మాకవరపాలెం మండలం రాచపల్లి పంచాయతీ కొత్తపాలెం గ్రామం నుంచి 30 కుటుంబాలు వైసీపీ నుండి తెలుగుదేశం పార్టీలో చేరాయి. వీరందరికి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, టీడీపీ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జోగుపాత్రుడు, జెమిందార్, అల్లు నాయుడు, కిషోర్, అడిగర్ల శ్రీను, గిరి రమణ పాల్గొన్నారు.

నోటి పరిశుభ్రతతో ఆరోగ్యం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: నోటి భద్రతతోనే ఆరోగ్యం సాధ్యమని, తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ హేమలత తెలిపారు. వరల్డ్ ఓరల్ హెల్త్ డే సందర్భంగా డెంటల్ సర్జన్ హ్యాపీ క్రిస్టియన్ రాజు ఆధ్వర్యంలో పాడేరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆధ్వర్యాన శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక సుండ్రుపుట్టు ఎంపిపి పాఠశాలలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. వందమంది చిన్నారులతో పాటు పాఠశాల సిబ్బందికి ఉచితంగా దంత పరీక్షలు చేశారు. చిన్నారులకు మందులు, టూత్ బ్రష్, టూత్ పేస్ట్, టంగ్ క్లీనర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హ్యాపీ క్రిస్టియన్ రాజు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికి నోటి ఆరోగ్యం చాలా అవసరమన్నారు. ప్రతిరోజు గోరువెచ్చటి నీటితో పుక్కిలించాలని, ఉదయం, రాత్రి దంతాలను శుభ్రం చేసుకోవాలని తెలిపారు. నోటిని పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పలు వ్యాధులు దరి చేరవన్నారు. దంతాలను సరియైన విధానంలో శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజ్ సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వమిత్ర, డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ జమాల్ భాషా పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న వైద్యులు, సిబ్బంది



సర్టిఫికెట్లను అందజేస్తున్న కోచ్

జాతీయ స్థాయి పోటీలకు జ్యోతి ఎంపిక

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: ఈ నెల 26 నుండి 29 వరకు జమ్ముకాశ్మీర్‌లో జరగనున్న సబ్ జూనియర్ నేషనల్ వుషు టోర్నమెంట్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ టీంలో నర్సీపట్నం నుండి గండి జ్యోతి 48 కేజీల విభాగం గర్ల్స్ కేటగిరిలో ఆడనుంది. ఆమె గత సెప్టెంబర్‌లో శ్రీకాకుళం స్టేట్ వుషు పోటీలలో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించి ఈ టోర్నమెంట్‌కి అర్హత సాధించారని సీనియర్ కోచ్ యర్రా శేఖర్ తెలిపారు. నేషనల్‌లో మెడల్ సాధించాలని నింజాస్ అకాడెమీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సుతాపల్లి శ్రావణ్, సుతాపల్లి శ్రీకాంత్, ఎన్ఐఎస్ వుషు కోచ్ ప్రియాంక అభినందించారు. ఈమె విజయం సాధించాలని తోటి బాక్సర్లు, తల్లిదండ్రులు మెంబర్లు ఆకాంక్షించారు.



సర్టిఫికెట్లను అందజేస్తున్న అతిథులు

బయోమెడికల్ రీసెర్చిపై
ముగిసిన 'గీతం' వింటర్ స్కూల్

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మాస్ స్పెక్ట్రో మెట్రి సదుపాయాన్ని ఉపయోగించుకుని బయోమెడికల్ పరిశోధనలలో ప్రాజెక్టుల నిర్వహణపై అధ్యాపకులకు నాలుగు రోజుల వింటర్ స్కూల్ శిక్షణ శనివారం ముగిసింది. గీతం మల్టీ డిసిప్లినరీ యూనిట్ ఆఫ్ రీసెర్చి ఆన్ ట్రాన్స్‌లేషనల్ ఇనిషియేటివ్స్ (మూర్తి) పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో గీతం ఛాన్సలర్ ప్రొఫెసర్ వీరేంద్రసింగ్ చౌహన్, గీతం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం, శాస్త్రవేత్త ప్రొఫెసర్ పి.బలరామ్ హాజరై దిశానిర్దేశం చేసారు. శరీరంలోని రక్త నమూనా ఆధారంగా మాస్ స్పెక్ట్రో మెట్రి ఉపయోగించి రోగ లక్షణాలను ఎలా గుర్తించవచ్చో ప్రొఫెసర్ రీటా క్రిస్టోఫర్ వివరించారు.. ప్రొఫెసర్ హేమలత బలరామ్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య రంగంలో మాస్ స్పెక్ట్రో మెట్రి ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో గీతం ప్రో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ, బాబా అణుశక్తి పరిశోధన కేంద్రం (బార్క్) విశ్రాంత శాస్త్రవేత్త, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలంయం విశిష్ట ప్రొఫెసర్ బివిఆర్.టాటా, ప్రోగ్రామ్ డైరక్టర్ ప్రొఫెసర్ జివిఆర్.శర్మ పాల్గొని సర్టిఫికెట్‌లను అందజేసారు.

గిరిజనులకు తప్పని అవస్థలు
డోలీలో ఆసుపత్రికి తరలింపు

ప్రజాశక్తి-పెదబయలు: మండలంలో గోమాంగి పిహెచ్‌సి పరిధి బొండపల్లి పంచాయతీ బొండపల్లి గ్రామస్తులకు డోలీ మోత తప్పలేదు. గ్రామం నుంచి మూడు కిలోమీటర్ల దూరం రహదారి సౌకర్యం లేక పోవడంతో అనారోగ్యంతో బాధపడుతున్న దొర చిన్నమ్మను డోలీ మోతలో బొండపల్లి వరకు మోసుకొచ్చారు. కుమారుడు, కుటుంబ సభ్యులు డోలి మోతతో 3 కిలోమీటర్లు తరలించి అక్కడి నుంచి పెదబయలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు ప్రయివేటు వాహనంలో తరలించారు.



తరలిస్తున్న కుటుంబ సభ్యులు

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాటాలు

-వర్ధంతి సభల్లో పలువురు వక్తలు



విశాఖలో నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- విలేకర్ల బృంధం

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురు వర్ధంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరంలో వారి త్యాగాలను పలువురు కొనియాడారు. వారి చిత్రపటాలకు ఘనంగా నివాళులు అర్పించారు.

మునగపాక : స్థానిక జెడ్‌పి హైస్కూల్ ఆవరణలో ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి శనివారం సిపిఎం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశంలో కుల, మతాల మధ్య చిచ్చులేపుతున్న బిజెపి మతోన్మాదం విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వీవీ.శ్రీనివాసరావు, ఆళ్ల మహేశ్వరరావు, ఎస్.బ్రహ్మాజీ, టెక్కలి జగ్గఅప్పారావు, ఆడారి శేఖర్, శివ పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని ఎ.కోడూరులో సిపిఎం మండల నాయకులు ఎర్ర దేవుడు ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఈర్లె నాయుడు బాబు, కె.పాపయ్య, లెక్కల సీతారాం, విద్యార్థులు పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ సంత బయలు వద్ద భగత్‌సింగ్ చిత్రపటానికి సిఐటియు ఆధ్వర్యంలో పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు వాసంశెట్టి రవి, వాసంశెట్టి దేవరాజు, ఎ.నాగరాజు, ఈశ్వరరావు, శంకర్ ముని తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం ఆధ్వర్యంలో పరవాడ బాలికల హైస్కూల్లో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వరి భగత్ సింగ్ చిత్రపటానికి పుష్పాలతో అంజలి ఘటించారు. విద్యార్థులు భగత్ సింగ్ బాటలో నడవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, శోభ, జ్యోతి పాల్గొన్నారు.

కశింకోట : సిఐటియు, ఐద్వా ఆధ్యర్యంలో కశింకోటలో భగత్‌సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా సంయుక్త కార్యదర్శి డిడి.వరలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని మోసయ్యపేట పంచాయితీ కొత్తూరు గ్రామంలో భగత్ సింగ్ విగ్రహానికి ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు పూలమాలవేసి నివాళులర్పించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.సోము నాయుడు, కడారి అప్పారావు, చందక నరసింహమూర్తి, సింహాద్రి, చుక్కల నరసింగరావు పాల్గొన్నారు.

చోడవరం : స్థానిక ఉషోదయ కాలేజీలో పిడిఎస్ఒ, ఎన్‌వైఎస్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌వైఎస్ జిల్లా కన్వీనర్ ఎన్.భాస్కర్, పిడిఎస్ఓ నాయకులు పి.మౌనిక, విద్యార్థులు పాల్గొన్నారు.

అనకాపల్లి : అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఉడ్‌పేట జీవీఎంసీ ప్రైమరీ స్కూల్లో నివాళులర్పించారు. విద్యార్థులను కాపీ రైటింగ్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొట్టా చిన్ని యాదవ్, పాఠశాల హెచ్‌ఎం బలిరెడ్డి శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉక్కునగరం : భగత్‌సింగ్ స్ఫూర్తితో విశాఖ ఉక్కును కాపాడుకుందామని స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ సిఐటియు గౌరవ అధ్యక్షులు ఒవి రావు అన్నారు ఉక్కు నగరం సిఐటియు కార్యాలయంలో భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని నివాళులర్పించారు. యూనియన్ అధ్యక్షులు జి శ్రీనివాసరావు. నాయకులు. శశిభూషణ్. యు సోమేష్. చట్టి నర్సింగరావు. సూర్యకుమార్, రాముడు, అప్పారావు పాల్గొన్నారు.



మధురవాడలో..

మధురవాడ: సిఐటియు మధురవాడ జోన్ కమిటీ ఆధ్వర్యంలో కొమ్మాది కూడలి వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జోన్ కార్యదర్శి పి.రాజ్‌కుమార్ బి నాగేశ్వరరావు, ఎర్రన్న, కే వెంకటరావు, రమేష్, టి సత్యనారాయణ పాల్గొన్నారు.

సీతమ్మధార : తాటిచెట్లపాలెం ఎఎస్ఆర్ నగర్ లో భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్ గురు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజు మాట్లాడుతూ భగత్ సింగ్ ఆశయ సాధనకు యువజన సంఘాలు కృషి చేయాలన్నారు. డివైఎఫ్ఐ అక్కయ్యపాలెం అధ్యక్షుడు కోటి, నాయకులు రాజు, ఆనంద్, ప్రకాష్ పాల్గొన్నారు.



నర్సీపట్నంలో..

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్ త్రినాథ రావు, గొట్టేటి రవి, ఎం మహాలక్ష్మి, జె మాధవి, విద్యార్ధినీ విద్యార్థులు పాల్గొన్నారు

సిఐటియు ఆధ్వర్యంలో: సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో సిఐటియు కార్యాలయం, వై జంక్షన్, సంగివలస అనిల్ నీరు కొండ ఆసుపత్రి కి వెళ్ళే దారిలో ఉన్న ఆటో స్టాండ్ల వద్ద భగత్ సింగ్ వర్ధంతి నిర్వహించారు. పలువురు ఆటో కార్మికులు పాల్గొన్నారు.

సిపిఐ ఆధ్వర్యాన: స్థానిక పార్టీ కార్యాలయంలోభగత్ సింగ్ వర్ధంతి నిర్వహించారు. పార్టీ నాయకులు అల్లు బాబూరావు, ఏరియా సమితి కార్యదర్శి కానూరి రాంబాబు, కొండపు ఈశ్వర రావు, అల్లం గోవింద, ఎం వీర్రాజు, గిడుతూరి సూరిబాబు పాల్గొన్నారు

నక్కపల్లి: స్వాతంత్ర్య సమరయోధులు, విప్లవ వీరులు భగత్ సింగ్, రాజుగురు, సుఖదేవ్ ల పోరాటం యువతరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్ తెలిపారు. స్థానిక సిపిఎం కార్యాలయం వద్ద శనివారం భగత్ సింగ్, రాజుగురు, సుఖదేవ్ ల 93 వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.రమణ, కె.దుర్గ, జె.అప్పన్న, వెంకట్రావు పాల్గొన్నారు.

అనకాపల్లిడెస్క్: నర్సీపట్నంలో భగత్ సింగ్ వర్ధంతిని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జీ.గీతాకృష్ణ మాట్లాడుతూ, భగత్ సింగ్ పోరాట పటిమను అందరూ అలవర్చుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ సభ్యులు జ్ఞానేశ్, వరహాలు, రవి, కిషోర్ పాల్గొన్నారు.

అనకాపల్లిడెస్క్: రాజ్యాంగంపై జరుగుతున్న దాడిని ఎదుర్కోవడమే భగత్ సింగ్ కి ఇచ్చే నిజమైన నివాళి అని నర్సీపట్నంలో ట్యాక్స్ పేయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.త్రిమూర్తులరెడ్డి అన్నారు. నర్సీపట్నం సిఐటియు కార్యాలయంలో భగత్ సింగ్ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు ఎల్.గౌరి, సిఐటియు జిల్లా నాయకులు అడిగర్ల రాజు, నాయకులు టి.ఈశ్వరరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.రామకృష్ణ, ముఠా కార్మిక సంఘం నాయకులు సత్తిబాబు పాల్గొన్నారు.

కోటవురట్ల: భగత్ సింగ్ పోరాట స్ఫూర్తి మరువలేనిదని సిఐటియు జిల్లా కోశాధికారి వి శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా ఎం అప్పలరాజు, ఐకెపి సంఘం రాష్ట్ర అధ్యక్షులు రూపా దేవి తెలిపారు. ఈ సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డేవిడ్ రాజు, త్రినాథ్, ఎం.రాజేష్, రాజ్యలక్ష్మి, వనజ, మీనాక్షి, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : కొత్తరోడ్డు, స్ప్రింగ్ రోడ్డు కార్మికుల ఆధ్వర్యంలో శనివారం భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. వారినుద్దేశించి డివైఎఫ్ఐ నాయకులు కె.సంతోష్ కుమార్, సిఐటియు నాయకులు ఎం.సుబ్బారావు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వై.రాజు, కెవిపి.చంద్రమౌళి, మెడికల్ రిప్రజెంటేటివ్ నాయకులు కళాధర్, మత్స్యకారుల నాయకులు కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భారత నాస్తిక సమాజం, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భారత నాస్తిక సమాజం కేంద్ర నాయకులు జె.రవి, రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి, జిల్లా అధ్యక్షులు వై.నూకరాజు, సునీత, బ్రూనో, అభ్యుదయ రచయిత సంఘం నాయకులు యు.అప్పలరాజు , తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు దేశ సేవకు అంకితం కావాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి -అనకాపల్లి

భగత్ సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు దేశ సేవకు అంకితం కావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక దొడ్డి రామానాయుడు భవనంలో శనివారం జరిగిన భగత్ సింగ్ 93వ వర్ధంతి సభలో భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురు చిత్రపటాలకు లోకనాథంతో పాటు ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ నాయకులు ఆర్.శంకరరావు, ప్రస్తుత జిల్లా కోశాధికారి ఎస్.రమణ, సర్వేజన ఐక్య వేదిక వ్యవస్థాపకులు కోరిబిల్లి పరమేష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెస్.శివాజీ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కె.లోకనాథం మాట్లాడుతూ ఈ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం, దోపిడీ, వివక్ష, మతమౌఢ్యం, పేదరికం, కుల కుటిలత్వం లేని సమసమాజం కావాలని కోరుకున్నాడని చెప్పారు. మానవత్వం, ధైర్యం, తెగువ, ప్రేమ, త్యాగం, అంకితభావం, అధ్యయనం, అభ్యుదయం, మత సామరస్యం, శ్రామిక వర్గ దృక్పథం, తన ఆలోచనలపై ప్రగాఢ విశ్వాసం భగత్ సింగ్ సొంతమని పేర్కొన్నారు. నేడు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం భగత్‌సింగ్ ఆశయాలకు భిన్నంగా వ్యవహరిస్తుందన్నారు.



విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న లోకనాథం

భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు ఈ సందర్భంగా బహుమతుల ప్రదానం చేశారు. డిబేట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను వరుసగా ఎస్‌వికె.నర్సింగ్ కళాశాలకు చెందిన ఎస్.కృష్టవేణి, హరిప్రియ, లక్ష్మీభవాని, వ్యాసరచన పోటీల్లో ప్రథమ, తృతీయ బహుమతులు ఆర్ఎఆర్ఎస్ వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజ్ విద్యార్థులు వి.రాజ్యలక్ష్మి, సమ్మోహన కిరణ్, ద్వితీయ బహుమతి ఎస్‌వికె.నర్సింగ్ విద్యార్థిని ప్రియాంక గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్, ఆర్ఎఆర్ఎస్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు కేశవ్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్.శివాజీ, నాయకులు ఎ.రాజు, బి.శివ, గొర్లి తరుణ్, కుమార్, చలపతి, మోహన్, గోపి, ఎస్ఎఫ్ఐ జిల్లా కోశాధికారి ఎస్.రమణ నాయకులు రమేష్, కార్తిక్, విద్యార్థులు పాల్గొన్నారు.